# స్వాతి చినుకులు

స్వాతి పెరటి వరండాలో నిలబడి మేఘావృతమవుతున్న ఆకాశం వైపు చూసింది. అంతలోనే టపటప చినుకులు ప్రారంభమయ్యాయి. ఉరుములు లేని వాన. ఆకుపచ్చని చెట్లమీద పడి కొన్ని చినుకులు నేలజారి మట్టిలో కలిసిపోతున్నాయి. అవి చెట్టుమీద కాదు. ఆమె హృదయ వనంలో కురుస్తున్నట్లు ఎగిరి గంతులేసింది. ఆనందం పొంగి హృదయం నుండి కళ్ళలోకి ముఖంలోకి చివరకు శరీరమంతా వ్యాపించింది.

ఆకాశం నుండి జారిపడే ఆ వాన చినుకుల్లో తడుస్తూ చిన్న పిల్లలా గంతులెయ్యాలనే కోరిక ఆమెను నిలవనియ్యడం లేదు. ఆ కోరిక నిన్నటిది మొన్నటిది కాదు. పెళ్ళయిన దగ్గర నుంచి ఆ కోరిక మనసులోనే దాచుకుంది. పెళ్ళే ఆమె కోరికకు ప్రతిబంధకమైపోయింది. పెళ్లయితే ఇటువంటి సరదాలు చంపుకోవలసిందేనా? ఆమె బాధపడుతూనే ఉంది.

పెళ్ళయిన భర్తతో సరదాగా తిరగవచ్చంటారు? నిత్యం వసంతమే అంటారు. కాని ఈ చినుకులు అందించే ఆనందం ఎవరు అందించగలరు? ఆమె తర్కించుకుంటూనే ఉంది.

ఇంట్లో అత్తలేదు. భర్త లేడు. చినుకులు టప టపా పడుతున్నాయి. ఆమె మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. స్వాతి వరండాలో నుంచి మెట్లు దిగి ఆ వాన చినుకుల్లో తడిసి మురిసిపోవాలని అడుగులు ముందుకు వేసింది. భర్త మంచివాడే కాని తల్లికి ఎదురు చెప్పలేడు? ఇన్నాళ్టికి అవకాశం వచ్చింది. వాళ్ళు రాకుండా తన సరదా తీరాలి.

చిన్నతనం నుంచి స్వాతికి ఆ చినుకుల్లో తడవటమంటే ఎంతో సరదా! పల్లెలో పుట్టిన ఆమె వానచినుకులు పడుతుంటే. నడివీధిలో తోటి పిల్లలతో గంతులేసేది. "వాన! వాన! చెల్లప్పా! వాకిలి తిరిగె చెల్లప్పా! తిరగాలేని చెల్లప్పా!" అంటూ చేతులు చాచి గిరగిరా తిరిగి నేలజారే వారు కొందరయితే, కొందరు

తిరగలేక ఆగేవారు. ఒకరోజు అలా తిరుగుతుంటే కాలికి రాయి తగిలి స్వాతి పడిపోయింది. పాదం దగ్గర ఎముక చిట్లింది. కాలుకు కట్టుకట్టారు. కొన్నాళ్ళు నడవకూడదని మంచం మీద పడుకో పెట్టారు. నొప్పి తగ్గాక మళ్ళీ మామూలే.

స్వాతి మరీ అందగత్తె కాదు. చామనఛాయ రంగుతో, కనుముక్కు తీరువుతో ఆకర్షణీయంగా ఉండేది. అన్నిటికంటే నల్లని పొడవైన కురులు ఆమెకు అందాన్ని తెచ్చి పెట్టాయి. నల్లని కురులు విరబోసుకుని ఆటలు ఆడుతుంటే నాట్యమయూరిని తలపించేది. రోజూ తడవటానికి వానలు రావుగా. ఒక్కొక్కప్పుడు ఆ చినుకుల్లో తడిస్తే వొత్తైన జుట్టు ఆరక జలుబు చేసేది. పెద్దలు కోపం చేసినా అందరు పిల్లలా ఆమె లెక్కచేసేదికాదు. బి.ఎ. చదవగానే పెళ్ళయిపోయింది. చదువు ఆగిపోయింది. అత్తింట్లో అడుగుపెట్టింది. అది పట్నం. రెండు గదుల ప్లాటు. సౌకర్యంగా బాగానే ఉంది. ఇంట్లో అత్తగారు పెద్ద దిక్కు. సినిమాలు షికార్లు, ఒకటేమిటి భర్తతో సందడి, సరదా! రోజులు గడుస్తున్నాయి.

అంతలో ఒకరోజు వాన చినుకులు టపటపా పడుతున్నాయి. అనుకోని ఆ శబ్దానికి వంటింట్లో ఉన్న స్వాతి ఉలిక్కి పడింది. గ్యాస్‌పొయ్యి కట్టేసి కంగారుగా హాల్లోకి వెళ్ళింది. ఆతురతగా తలుపు తీసింది ఎదురుగా వాన చినుకులు కనపడలేదు. మరో గుమ్మం కనపడింది. ఉసూరుమంటూ తలుపుమూసి తిరిగి వంటింటిని అనుకుని ఉన్న బాల్కనీలోకి వెళ్ళింది.

"ఏమిటే ఆ పరుగులు ఏమయిందే?" అంటున్న అత్తగారి మాటలు వినిపించుకోలేదు స్వాతి. బాల్కనీలో నిలబడితే పడుతున్న చినుకులు కనబడుతున్నాయి. కాని వాన చినుకులు బాల్కనీలో పడవు. అయినా చేతులు రెండు చాచి బాల్కనీ గోడ మీద వంగి మరింతగా చేతులు చాచింది. ఒకటి రెండు చినుకులు మాత్రం అరచేతుల్లో పడ్డాయి. వాటిని ముఖానికి రాసుకుంది. ఆ వాన చినుకులు అందనందుకు ఆమె ప్రాణం ఉసూరుమంది.

ఏమి ప్లాటులో? సూర్యచంద్రులు కనపడనే కనపడరు. వెన్నెల కరువు. ఎండతో, వానతో సంబంధమేలేదు. చిమ్మ చీకటి మాత్రం చిందులేస్తూ ఉంటుంది. మరో ప్రయత్నంగా ఆమె తలుపు తీసుకుని కిందికి అడుగులేసింది.

ఎక్కడికే? ఆ కంగారేమిటి? నీకు మతికాని పోయిందా? అత్తగారి అరుపులు స్వాతికి వినబడలేదు ఆమె ఆలోచన మరొక వైపు. మూడవ అంతస్తు నుంచి పరుగులాంటి నడకతో కిందికి దిగింది. సెల్లారులో నుంచి బయటకు వచ్చింది.

చినుకులు చిన్నవై వానగా మారింది. వానలో అడుగు పెట్టి గిరగిరా తిరిగింది. కొందరు అమ్మాయిలు ఆమెను చూసి వారు కూడా వానలోకి వచ్చారు. ఆమెతోపాటు గంతులేస్తున్నారు. వర్షమే పాటయింది వారికి. కిందికి దిగి వచ్చిన అత్తగారు కోడల్ని చూసి ఆశ్చర్యపోయింది. కోడలు సరదా ఆమెకు పట్టలేదు. కోడలికి పిచ్చిపట్టిం దనుకుంది.

"స్వాతి నీకు బుద్ధి లేదా? రా లోపలికి రా వాడు రానీ! నీ సంగతి తేలుస్తా!" గట్టిగా అరిచింది.

"స్వాతి ఆ మాటలు వినిపించుకోలేదు" అత్తగారి కోపం పెరిగింది.

"రా..... లోపలికి! సిగ్గులేనిదానా! మమ్మల్ని అప్రతిష్టపాలు చేసావు" అంటూ నానా మాటలు మాట్లాడింది. ఇంక ఉండబట్టలేక ఆయాసపడుతూ పైకి వెళ్ళిపోయింది అత్తగారు!.

సరదా తీరగానే మామూలు స్థితికి వచ్చింది స్వాతి. జరిగిన గందరగోళం ఆమె ఊహించుకోలేకపోయింది. న్యాయస్థానంలో లాగా అత్తగారు తల్లిదండ్రులను పిలిపించి నేరారోపణ చేసింది. తండ్రి మందలించాడు.

"తల్లి కూడా స్వాతిదే తప్పని చెప్పింది. నేనేం తప్పు చేసా? అయినా చెయ్యకూడనిపని నేనేం చేసాను. స్విమ్మింగ్ డ్రస్సు లేసుకుని గంతు లేసానా? నిండు చీరలో సరదాగా వానలో తడిస్తే తప్పా? అందరినీ నిలదీసింది స్వాతి. స్వాతి మాటలు నిజమే అనిపించాయి అందరికి, కాని అత్తింట్లో అలా చిన్ని పిల్లలా ప్రవర్తించకూడదు. అది అందరి ఆరోపణ సరే నాయింట్లో నేగంతులేస్తా. నేను సొంత యిల్లు కొనుక్కోవాలి. నేను ఉద్యోగం చేసి సంపాదిస్తా అంది పట్టుదలగా స్వాతి. సరే అప్పుగా యిస్తా, ముందు ఇల్లు కొనుక్కొని ఉద్యోగం చేసుకో కాదనను అన్నాడు తండ్రి. రాము అదేమాట అన్నాడు. చిన్ని ఇల్లు కొనుక్కుంది. పెరటిలో చిన్నతోట పచ్చని కాంతులతో కలకలలాడుతోంది. అత్తగారు మారలేదు. స్వాతి కోరిక తగ్గలేదు. స్వాతి వానలో చిన్ని పిల్లలా గంతులేస్తోంది. ఆమె ఆనందం అవధులు దాటింది. ఆ యిల్లు కొనుక్కున్నాక వచ్చిన మొదటి వాన అది. అది స్వాతి వాన. వానలో గిరగిరా తిరిగింది. తడిసిన కురులు వీపంతా కమ్ముకున్నాయి. స్వాతికి ముచ్చటైన వాన. అత్తగారు చూసింది. కోపం ముంచుకొచ్చింది. ఆమె వానలో తడుస్తున్న దానికంటె తన మాట వినలేదన్నదే అత్తగారికి కోపం వచ్చింది. "ఏమిటే ఈ గోల వయసొచ్చినా నీ పిచ్చి తగ్గదా?" అత్తగారు అరిచింది. ఈ పెరటిలో పడ్డ చినుకులన్నీ నాకోసమే నే

తడిస్తే మీకేమిటి బాధ. రండి మీరు తడవండి! ఆనందించండి! అన్నట్టు మీకు నెత్తిన చినుకు పడితే మొక్క పెరగడం మొదలు పెడుతుందిగా, అక్కడే కూర్చోండి. ఏం చేస్తాం కోపంలేని సానుభూతి చూపించింది స్వాతి. వానలో తడుస్తూ చిందులేస్తూనే ఉంది.

అప్పుడే అక్కడకు వచ్చిన రామం భార్య మాటలు విని నవ్వుకున్నాడు. ఆ వానలో తడుస్తున్న స్వాతి విప్పారిన నల్లని కురులలో చూడముచ్చటగా ఉంది. కెమెరా పట్టుకొచ్చి "స్వాతి సరిగా నిలబడు" అటు తిరుగు, ఇటు తిరుగు అంటు ఫోటోలు తీసాడు. ఆ మొంతం వెళ్ళి ఆమెను తమ బాహువుల్లో బంధించాలనుకున్నాడు. స్వాతి పొడవైన ఆ నల్లని కురులంటే అతనికి చాలా ముచ్చట. తల్లి ఎదురుగా ఉంది. కాస్త మొహమాట పడ్డాడు. కెమెరా పక్కన ఎట్టి వానలోకి దిగాడు. "రండి, రండీ" స్వాతి పిలుపుకు ముగ్ధుడై ఆమె చేయిపట్టుకుని రామం కూడా స్వాతి చినుకుల్లో చిందులేసాడు. ఇన్నాళ్ళు భర్త ఉన్న తన సంతోషం పంచుకోవడంలో తాను వంటరిది. ఇప్పుడు భర్త అనురాగ కరచాలనంతో పూచిన చెంగల్వలా ఆ వానలో పులకించిపోయింది స్వాతి.

*ప్రపంచ పటంలో మనదేశం జనవరి 2006, మాస పత్రిక.*